కథానిక

# జరిగిన నాటకం

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

అసలీగొడవే రాకపోను—గాలి విసురుగా బీచ్ లోకి బయలుదేరకపోతే. హిప్‌పోకెట్‌లా వెనకాలబడి తిరిగే సుబ్బారావు ఆవేళ లేకపోయాడు. ఊరికెళ్లుంటాడు—లేకపోతే కాఫీ ఎలా ఒదులుకుంటాడు? నాకు మిత్రరత్నాలు చాలా తక్కువ గనక బీచ్‌కి బయలుదేరకతప్పింది కాదు.

అక్కడ రేడియో సంగీతగరళం పోసేస్తోంది చెవుల్లో. మొదట మావాడి ఇంగ్లండు రిలీఫ్ నేపులాంటి ముఖంచూసి సంగీతపు బాధ ఏమోననుకున్నాను. అసలు వాడి భార్య చాలా పాడుతుంది. (వాడిని భగవంతుడు రక్షించు గాక!) దానికితోడు ఇక్కడా అదేనాఆనివాడు బాధపడుతున్నాడనుకున్నాను. నేనూ సంభాషణలోకి దిగే పరిస్థితిలోలేను — చెవులిచ్చినందుకు బ్రహ్మను తిట్టుకుంటూ— కూము మహానది వ్రుళ్లులో గ్రుక్లుముక్కిచ్చిన యుజు-నిలాగేలిట్టించిందటపూర్వం పానుగంటివారిచేతకూచున్నాను.

కాస్సేపు పోయేసరికి వెంకట్రావు నాకేసి తిరిగి, వెధవ మొహంతోనే, "ఎంతసేపైందిరా వచ్చి?" అన్నాడు.

చెప్పాను. పిలవలేదేమన్నాడు "నీ ఏకాగ్రత భంగం చెయ్యడం ఇష్టంలేక" అన్నాను.

"ఏకాగ్రతలాగే ఉంది బ్రతుకు" అన్నాడు వెంకట్రావు ఉస్సురంటూ.

"ఏం?" అన్నాను.

"ఏమిటేమిట్రా? సంసారం సాగరం దుఃఖం అని పెద్దలు వట్టినే అన్నారా?"

"పెద్దలనేదెల్లా ఉన్నా, ఈ కాలపుకుర్రాళ్లు వట్టి చచ్చు పెద్దమ్మలు అన్న ఒక మహనీయుని మాటలు మాత్రం నిజం చేస్తున్నావ్" అన్నాను.

"చావమంటావుట్రా? నాబాధతో నేను చస్తూంటే, నీపాండిత్యం అంతా నాముందు వెలిగిస్తావ్"అని ఖస్సుమన్నాడు.

"పాండిత్యమేముంది? నీకు మూడునెలలైంది పెళ్ళయి. అప్పుడే సంసారం సాగరం దుఃఖం, భజగోవిందం మూఢమతే అంటే, ఇంక నీగురించి ఏమనుకోమంటావ్?"అన్నాను.

"నీయిష్టం వచ్చినట్లనుకో. కాని నీ బుర్రనంతా ఉపయోగించి నాకేదైనా దారి చూపు" అన్నాడు

"అసలు నీకొచ్చిన కష్టం ఏమిటి?"అన్నాను.

"ఇంకేముంది? — శ్యామల వెళ్లిపోయింది" అన్నాడు.

"ఇంటికే?"

"షికారైతే ఇంత బాధెందుకూ? నాకొంప ముంచావురా బ్రదర్"అన్నాడు వెంకట్రావు.

చుట్టూ తిరిగి శాఖీకంపూదికే వచ్చింది.

"మధ్య నేనేం చేశాను? ఆవిడ నా సలహా అడిగితే కావలసినంతసేపులెక్చరిచ్చి, పాతివ్రత్యం యొక్క మహిమ బోధించి ఎలాగైనా ఉంచేసేవాణ్ణి..."

"చాల్లే... నాకావిడ కోపం గురించి ఒక్కసారైనా చెప్పావూ? నీ సలహా అడిగేసరికి, ఓ, ఇంకేం, వండ్రఫుల్. కానీ అన్నావుకాని, ఉన్న మాటలు నాలుగూ చెప్పి ఇదీ సంగతి, ఆపైన నీయిష్టం అని అంటే ఏదో చూద్దును గదా! ఒక్కసారైనా ఆవిడనైజం గురించి నువ్వు చెప్పలేదు. మంచిదనుకున్నానుకాని ఇంత పంతం ఉంటుందని కలగన్నానా?"అని మళ్ళా భజగోవిందం పోజువేసి కూర్చున్నాడు వెంకట్రావు.

"అసలేం జరిగిందిరా? కలతలొచ్చినా కాస్త సరిదిద్దుకోవాలిగాని, ఏదో తొందరపడివుంటావు కొంప మునిగింది"అంటూ, అసలుసంగతి తెలుసుకుందామని అడిగాను.

నెమ్మదిగా వాచంతా బయటపెట్టాడు. శ్యామల తోటరోజు సాయంత్రం సినిమాకెళ్దాం,

తొందరగా రమ్మని చెప్పిందట. పాపం, ఆరోజే ఎ. ఇ. దిగడాన్న మావాడు రాత్రి చీకటిపడ్డాక కాని రాలేకపోయాడట. దాంతో ఆమెకి కోపం వచ్చిందిట. మావాడైనా ఊరుకోవచ్చా? ఆఫీసులో తిన్న చీవాట్లు ఆవిడమీద క్రుమ్మరించాడట. దాంతో మాంటెజ్జెల్లో పెట్టల్లే ఇంతపని జరిగింది.

"ఏమైనా, పొరపాటు నీదేరా" అన్నాను. శ్యామల రిటైర్డ్ డి. యస్. పి. గారి అమ్మాయి. కొంత పోలీస్ స్పిరిట్ ఉండకుండా ఉండదు. దానిమీద ఆయనకిచిన్న మ్మాయి. కాంప్లికేటెడ్ టైఫాయిడ్ లా, ఇలాంటి కలయికమాత్రం మహా ప్రమాదకరం.

"నిజంరా బాబూ— బుద్ధి గడ్డితిని పెళ్ళిచేసుకున్నాను. బుద్ధిగడ్డితిన్నరకం దెబ్బలాడాను. పొరపాటు నాదే" అంటూ వాడు చాలా ఇదయాడు.

"అంత బాధపడకు .. రెండు రోజుల్లో ఆవిడే వచ్చేస్తుందిలే. పుట్టింటివారిని చూడాలని ఈ నెపం పెట్టి ఉంటుంది" అన్నాను.

వాడాశగా చూశాడు. "అంతేనంటావా?" అన్నాడు.

"అంతేరా. మరేం బాధలేదు. కొత్త కాపురాల లక్షణాల్లే ఇవి" అన్నాను. నా అనుభజ్ఞతకి నన్ను చాలా మెచ్చుకుని ఎలా ఐతేనేం వాడు కాస్త ఉపశమనం పొందాడు.

సంగీతం చంపేస్తోంది దోమల్తో కలిసి. లేచాము.

• • •

తరవాత మూడురోజులు బీచ్ కి పోలేదు—ఆఫీసులో పనిమూలాన. నాలుగోరోజు వెళ్ళేసరికి, పిప్పిపన్నుతో బాధపడుతున్నట్లు కూర్చున్నాడు మా వెంకట్రావు.

ఈసారి ఎలాగూ తప్పదు గనుక, "ఏంట్రా విశేషాలు? శ్రీమతి దయచేసిందా?" అన్నాను.

"లేదురా — నీ లెక్క తప్పే అయింది" అన్నాడు వాడు.

"రెండురోజులాగాలి" అన్నాను.

"ఇవాళ అయిదో రోజు... ఇంకా ఏం ఆగేది? ఇలాగే సంసాలు విచ్ఛిత్తి అవుతాయి— నువ్వే రాశావుగా! నీ బుర్ర ఉపయోగించి కాస్త మంచి ఉపాయం ఆలోచించరా ఆవిడని రప్పించడానికి" అన్నాడు.

వాస్తవిక విషయాలేమీ ఆవిడని రప్పించడానికి చాలవు. అబద్ధాలురాస్తే నీపని నాటితో సరి" అన్నాను

"అయితే ఆశ లేదంటావా?"

"ఆగరా బ్రదర్ నాలుగు రోజులు. కేవలం భార్యకోసం ఇలా బెంగపెట్టుకుంటే ఎవరన్నా నవ్వగలరు" అన్నాను.

"నవ్వితే నవ్వనీరా .. ఇల్లంతా చీకటై పోయి నేనేడుస్తూంటే నవ్వితే వీళ్ళకేమిటి ఒరుగుతుందో..."

"ఏం? ఎలక్ట్రిసిటీ రాడంలా?"

"వెర్రి వాడా! నువ్వు పెళ్ళిచేసుకున్నా, ఇన్నాళ్లు సంసారం చేసినా, ఇన్నిసంసారకథలు రాసినా, నీకు సంసారంమజా ఏమీ బోధపడలేదని నీ ప్రశ్న చెప్పేస్తోంది" అన్నాడు వెంకట్రావు.

"సంసారం సాగరం దుఃఖం" అన్నాను.

"ఏదో అన్నాన్లే...సరేగాని నామాట ఆలోచించవూ! ఎలాగైనా ఆమె ఇక్కడికొస్తేగాని మనస్సుకి శాంతి ఉండదు" అన్నాడు వాడు.

"పోనీ నువ్వే వెళ్ళరాదూ?" అన్నాను.

"ఇన్సల్ట్ రా..."

"సరే. ఆలోచిస్తాగా,"

తరవాత ఏవో ఆరీఇరీ మాట్లాడుకుని ఇళ్ళకి పోయాం.

మర్నాడుసాయంత్రం నాలుగుగంటలకి ఒక చీటీవచ్చింది వెంకట్రావుదగ్గర్నించి. వాళ్ళింటికి సాయంత్రంరమ్మని దాని సారాంశం. ఆఫీస్ పని అవగానే వెళ్లాను. ముసుగేసుకుని పడుకున్నాడు.

"ఏమిట్రాభాయ్! విరహమేనా?" అన్నాను.

వాడు మాట్లాడకుండా డాక్టర్ సర్టిఫికేట్ చూపాడు. వాడేదో దీక్షరోగంతో (ఆ జబ్బు పేరులో 18అక్షరాలున్నాయాయెను!) బాధపడుతున్నట్టు ఆది సర్టిఫికేట్.

"ఎన్నాళ్ళు సెలవుకి?" అన్నాను.

వాడు సీరియస్ గా "సెలవుకోసం కాదు. సర్టిఫికేట్ ఆవిడకోసం" అన్నాడు.

నాకర్థమైంది. నవ్వూవచ్చింది. ఇంతలో వాడు ఒక టెలిగ్రాఫ్ఫారమ్ నాచేతికిచ్చి, "రాయవల్సినట్లురాయి. కవివేగా!" అన్నాడు.

"ఏమిటి?? ఎవరికి?" అన్నాను తెల్లబోయి.

"శ్యామల కేనోయ్! జబ్బుగా ఉన్న వాళ్లు టెలిగ్రాములూ అవీ ఎలా ఇస్తారు? ఫలానా జబ్బుతో బాధపడుతున్నాడు, వెంటనే రమ్మని ఓ టెలిగ్రాం ఇచ్చి" అన్నాడు.

"ఇంతకీ జబ్బు నిజమా అబద్ధమా?" అన్నాను.

"సర్టిఫికెట్ చూడు" అన్నాడు.

"తీరా ఆవిడ వచ్చి ఉన్న సంగతి గ్రహించాక నా పరువుపోతుందే!"

"మరేం బాధలేదోయ్! ముందర టెలిగ్రాం ఇవ్వు"

డాక్టర్ సర్టిఫికెట్ ప్రకారం, "ఫలానా జబ్బుతో బాధపడుతున్నాడు, వెంటనేరమ్మని" రాశాను.

"నీ ఉపకారానికి ఎలా థేంక్ చెయ్యాలో తెలియడంలేదు" అన్నాడు.

"ఆవిడ రానీ, తెలుస్తుం"దనుకున్నాను.

ఆ మర్నాడే నేను బీచ్‌కిపోయాను సాయంకాలం. వెంకట్రావ్ ఎక్కడా కనిపించలేదు. శ్యామల వచ్చి ఉంటుందనుకున్నాను. ఎంచేతనో ఆ వేళ సంగీతం కాస్త శ్రావ్యంగా ఉంది.

అలా గెగడుస్తుందని ఆశతో మరుసటిరోజూ బీచ్‌కివచ్చేసరికి వెంకట్రావు మామూలుముఖం పెట్టి అక్కడ కూర్చున్నాడు.

"ఏంభాయ్! ఏం విశేషాలు?" అన్నాను.

"రోజులు మనవి కావురా" అన్నాడు.

"ఏంవొచ్చిందిమళ్ళా?" అన్నాను.

"ఆవిడ జవాబు రాసింది-చూడు" అంటూ ఓ ఉత్తరం నామీదికి విసిరేశువాడు. దాని సారాంశము ఏమిటంటే, నేను వాడికొచ్చిందన్న జబ్బు గురించి తనకి తెల్సుననీ, దానికి అర్థం గోడలెక్క బుద్ధిపుట్టడం అనీ, అంత సరదాగా ఉంటే కావలిసినన్ని గోడలెక్కమనీ, అందుకు తన సహాయం అనవసరమనీని

"ఈ జబ్బేమిటి?" అన్నాను.

"నిజమేట. సెలవుకోసం అని డాక్టరు అలాగ ఇచ్చాడట సర్టిఫికెట్. ఈవిడ దాని అర్థం కనిపెట్టేసింది" అని మొహం తెలవేశాడు వెంకట్రావు.

"అనవసరంగా నా పరువుతీసేశావు" అన్నాను.

"అంతేకాని నా గతేం కావాలనే గోలలేదు" అన్నాడు వెంకట్రావు. వాడి ముఖంలో నిరాశా, దైన్యమూ స్పష్టంగా కనిపిస్తున్నై. భార్యకోసం బెంగపెట్టుకొనే వాళ్ళుండొచ్చుకాని అంతగా ప్రదర్శించే వాళ్లు మాత్రంఉండకపోవచ్చును. వీడు పాపం, నా సహాయం ఆపేక్షిస్తున్నాడు. శ్యామలనికూడా నాకు బాగా తెల్సును. ఈ విషయంలో అంతుమాడ్దామనే బుద్ధిపుట్టింది.

"ఇలాగ విరహం ఊరికే ప్రదర్శించడం మీ ఆవిడదగ్గర ఎందుకూ పనికిరాదు. టిక్‌టాక్‌గా ఉండు. కొద్దిరోజులు పోయాక చూద్దాం" అన్నాను.

నాలుగురోజులపోయాక, ఒక ఉత్తరంరాశాను శ్యామలకి. వెంకట్రావు ఒక అమ్మాయితో తిరుగుతున్నాడనీ, డబ్బంతా ఆ అమ్మాయికి పారబోస్తున్నాడనీ, ఆమెనొకసారివచ్చి కాస్త బుద్ధి చెప్పమనీని.

ఈ ఉత్తరం తప్పక శ్యామలని తీసుకొస్తుందని నమ్మాను. ఏ విషయమూ కలుగజెయ్యని దుఃఖాన్ని భర్త మరొక స్త్రీతో సంబంధాన్ని కలిగిఉండడం ఆడదానికి కలుగజేస్తుందనేవిషయం నాకు బాగా తెల్సును. నాకేమిటి, అందరికీ తెల్సును.

ఆ మూడోరోజుకి శ్యామల వస్తుందనుకున్నాను. కాని ఆసాయంత్రం వెంకట్రావు తయారయాడు. ఆమె దీపావళికి గ్రీటింగ్ కార్డ్సు నాకూ వాడికి చెరొకటి పంపుతూ, ఇంకో కార్డు "మిమ్మల్ని ప్రేమించిన అదృష్టవంతురాలికి" అని రాసి జతచేసింది.

* * *

మావాడికి మతితో పాటు నాలో ఉన్న నమ్మకం కూడాపోయింది.

"నువ్వేదో ఉపాయంచెప్తావని అనుకున్నాను. నువ్వు మరీ పాడుచేశావ్ వ్యవహారం" అన్నాడు వెంకట్రావు.

"నన్నేదో పెద్దమనిషి అని అనుకునే ఆమె దృష్టిలో నన్నొక అబద్ధాలకోరుగాచేశావ్. రేపావిడ తిరిగొచ్చి ఏమిటీనాటకంఅంటే ఏంచెప్పుకోమంటావ్?" అన్నాను నేనింకాజోరుగా.

"ఆవిడ తిరిగిరావడంఅంటూ ఉంటే ఏమైనా చెప్పుకుందువు, నీ తరఫునకూడా. అదే లేదు" అన్నాడు వాడుకొంచెం తగ్గి.

"నామాటవిని వెళ్ళి బ్రతిమాలు. కావలస్తే

సినిమాహాలుకొస్తానను. ఒకవేళ కృష్ణుడికి సత్యభామచేసిన గౌరవం ఏమైనా నీకూ జరిగినా, మౌనం అవలభించు, గౌరవందక్కించుకో. ఇంత కన్న గొప్ప సలహా నీకేమీ ఇవ్వలేను" అన్నాను.

వాడేమీ జవాబివ్వలేదు. బహుశా నా గొప్ప సలహాలోని గుణాలని గురించి ఆలోచిస్తున్నాడేమో! ఇలాంటి సలహాలు ఎవరిబుర్రలోవాళ్ళకి పుట్టి అమలుజరిపితే కొంత అవమానంకాని, ఇంకొకరు చెప్పేరని చేస్తే మరేం బాధలేదు. ఏదో నాటకంలో పాత్ర నిర్వహించినట్లు పనిచేసేయవచ్చు.

ఇంతట్లో వెంకట్రావు చెలరేగాడు నా ఆలోచనలన్నిటినీ తప్పని తేలుస్తూ.

"అంతసిల్లీగా చచ్చినాసరే నేను ప్రవర్తించబోను. ఒకసారి అపాలజీఇస్తే బ్రతుకంతా ఒక అపాలజీలెటర్ అయికూర్చుంటుంది. నీకూనాకూ చేతకాకపోయిందనుకుని, ఊరుకుంటాను. నీ సలహా-చచ్చుసలహామాత్రం నాకక్కర్లేదు" అన్నాడు.

"ఉత్తమం. మౌనంప్రచండమైన ఆయుధం అని చాలా గొప్పవాళ్ళే అన్నట్టు జ్ఞాపకం. నీకింతకుముందే చెప్పుదామనుకున్నాను. ఆ ఆయుధం కూడా ఉపయోగించాలి. చివరికి నువ్వా ఆ దారికివచ్చినందుకు చాలాసంతోషం. కానీ," అన్నాను.

"ఏమిటి?" అన్నాడు వాడు తెల్లబోయి.

"నోరుమూసుకూర్చో" అన్నాను.

"ఇదీ ఒక ఆయుధమైనా, ఈ ఆ యు ధం ఆవిడదగ్గర పనిచేస్తుందని నాకేం నమ్మకంలేదు. ఇంతింత బలమైన ఆయుధాలే పనిచెయ్యలేదు గదా, ఆమెదగ్గర నోరుమూసుకూర్చుంటే లాభం ఉంటుందా?" అని వెంకట్రావు తన అనుమానాన్ని వెళ్ళగక్కాడు.

"వెర్రివాడా! మౌనం సర్వార్థదాయకం అన్నాడు సంస్కృతంవచ్చిన కవి. నీ బాధలన్నీ మరిచిపోయి ఈ పంథాచూడు" అన్నాను.

ఇంతట్లో మావాడిబుర్రలో ఒక గొప్పఉద్దేశం వచ్చింది. "పోనీ, ఈ మధ్య రాజగోపాలాచారి ఆడవాళ్ళ విధులనిగురించి మద్రాసులో అదేదో సభలో మాట్లాడుగదా. ఆ న్యూస్ కటింగ్ పంపితే?" అన్నాడు.

"ఏడ్చినట్లేఉంది తెలివి. రామాయణం అంతా విని ఏదో ప్రశ్న వేశాడట నీలాంటివాడే. నామాట విని నోరుమూసుకూర్చో" అన్నాను.

ఇంక పీడికళ్ళుబడకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాను. తుమ్మువస్తే ఆపలేనట్లు సలహా అడిగితే మానవమాత్రుడన్నవాడు ఇవ్వలేకుండాఉండలేడు. తీరా సలహా ఇస్తే పీకకిచుట్టుకు కూర్చుంటుంది. అంచేత వాడికిచెప్పినసలహా నేనూ ఆమలుపరుద్దామనుకున్నాను.

ఈ ఆలోచనలతో గుమ్మందాటుతూంటే వెంకట్రావు తొందరగావచ్చి, "చూడూ, మౌనం అంటే ఉత్తరాలురాయొచ్చా, రాయకూడదా?" అన్నాడు.

"ఉత్తరాలంటే మాట్లకన్న ఎక్కువ. అంచేత ఉత్తరాలూ రాయకు" అని చెప్పేసి వెళ్ళిపోయాను.

అప్పులవాడిలాగ వెంకట్రావంటే నాకు భయం పుట్టుకు రాసాగింది. బీచ్‌కి వెళ్ళడం మానలేక, మరోచోటికిపోయి కూర్చోడం మొదలెట్టాను. ఒక పదిరోజులు అలా సాగించాను. సుబ్బారావుకి ట్రాన్స్‌ఫరైందని తెలిసి విచారించాలో సంతోషించాలోనని ఆలోచిస్తూ కూర్చున్నాను ఒకనాడు. ఆలోచనలలో మునిగి వెంకట్రావురాకనే గమనించలేదు.

"ఏంరా బ్రదర్, ఎక్కడా కనిపించడమే మానుకున్నావు?" అంటూ వాడు ప్రక్కన కూర్చున్నాడు.

"ఏముందీ, పని" అన్నాను.

"ఇవాళ ఇక్కడికొచ్చావేం?" అన్నాడు.

"అక్కడ సంగీతం వినలేకరా" అన్నాను.

వాడిముఖం, ఏం సంగతోగాని మహా కాంతివంతంగా ఉంది. పెద్దనవ్వు ఒకటి నవ్వేసి, "నిజమేరా ఆకారణంచేతనే నువ్వా వచ్చేవన్నమాట. నేనూ అంతేసుమా" అన్నాడు.

"ఉద్ధరించేవులే" అనుకుని, "ఊఁ. ఇంకేమిటి కథ?" అన్నాను.

"ఏమిటేమిట్రా—నీఅంత తెలివైన వాడిని చూడలేదనుకో. ఒక్క దెబ్బలో మా ఆవిడ ఎక్స్టర్నల్ పాలిసీ అంతా మార్చుకుంది" అన్నాడు సంతోషంగా గర్వంగా.

"వచ్చిందా?" అన్నాను.

"ఊహూం. అప్పుడే? ఈ ఉత్తరానికి జవాబు రాయాలి. అప్పుడు వస్తుందనుకుంటాను అస లేమని రాసిందో తెలుసా?" అన్నాడు.

"నాకేం ఎక్స్‌రే కళ్ళు లేవుగా?" అన్నాను.

"అయితే విను. పదిరోజుల్లనించి నాకుంచి ఒక్క ఉత్తరమూ రానందుకు కారణం తెలీదనీ, నేను ప్రేమించిన యువతితోసహా అందరూ క్షేమంగా ఉన్నారని ఆశిస్తాననీ, నేను గోడ లెక్కడంలో చాలా దెబ్బలు తినడంలేదని తా ననుకుంటున్నానని ఇత్యాదయనూః. చివరకి సగౌరవంగా ముగిసింది ఉత్తరం."

"బాగుంది. జవాబు రాశావా?" అన్నాను.

"ఏంరాయయడం భాయ్—ఆరు కాగితాలు పాడయాయ్. కవిత్వం ఒలక్కపోతే పోయె, కంపైన కొట్టకుండా రాయాలా? ఛస్తున్నా ననుకో. ఎంతకష్టం! ఎంత నేర్పు కావాలీ—"

"దేనికీ?"

"ఉత్తరాలు రాయడానికి నీ కథల్లలే రాసుకుపోవడం అనుకున్నావేమిటి? ఎన్ని అర్థవంతమైన మృదుమధురమైన, నాతి క్లిష్ట అలాగని నాతి చప్పి, భావమాటాది విశేషాలు...తస్సాదియ్యా సెకండ్ లాంగ్వేజీ ఎప్పుడూ మనకి రాదాయె."

"ఇంతకీ జవాబు రాస్తానంటావ్?"

"సరి! దానికింకా ఆలోచనా? వనితతనం తత్థానుత్తరంరా స్తే ఒరే బ్రదర్, తెలియ కడుగుతానూ, నీలో షివల్రీ ఇంత లోపించిందేమిరా?"

"నా షివల్రీ మాట దేవు డెరుగును-నువ్వు కానీ ఉత్తరం రాశావా, వెళ్ళి కాళ్లు పట్టుకోవాలని మాత్రం మరిచిపోకు" అన్నాను.

వాడు ఉక్కిరిబిక్కిరి అయాడు. "నువ్వు సీరియస్‌గానే మాట్లాడుతున్నావా?" అన్నాడు.

"అక్షరాలాను."

"నీ సలహా కాస్త మంచి ఫలితా లిస్తోందని నేను సంతోషిస్తే, ఇంతట్లో నీకీ విపరీతపుటూహాలెల్లా పుట్టాయి?" అన్నాడు.

"ఏమో నీ ఇష్టం. నేను సలహా ఇచ్చానని మాత్రం మరిచిపోకు. ఏదారి ఎన్నుకోనేదీ నీ ఇష్టం" అన్నాను ఘాటుగా.

"ఐతే రాయన్లేరా" అన్నాడు వెంకట్రావు.

ఇంకో పదిరోజులదాకా వీడి దర్శనం కాలేదు. జవాబురాసి ఉంటాడనుకున్నాను. కాని పదకొండోరోజున రోజుకుంటూ వచ్చి, "బుర్ర అంటే నీదిరా బ్రదర్" అన్నాడు.

"ఏం గిరాకీ?" అన్నాను.

"మళ్ళీ ఉత్తరం వచ్చింది" అన్నాడు బ్రహ్మానందంగా.

"వస్తూందా?" అన్నాను.

"అదే లేదు కాని పాపం చాలా మంచిగా రాసిందిలే. ఆ విషయాలన్నీ నీకెందుకుగాని, తన కక్కడ ఏమీ తోచడంలేదుట నాజీవితం ఎలాగ ఉందో రాయమంది. నామీద తన కెన్నడూ కోపంలేదనీ, వాళ్ళ నాన్నని చూడాలని వెళ్ళానని రాసింది. ఇలా రాస్తుందని కలలో కూడా అనుకోలేదురా బ్రదర్!" అన్నాడు వెంకట్రావు.

"కాని, ఏమిటిలాభం? రావడం లేదుగా?"

"దానికేముంది? వెళ్లి తీసుకొచ్చేస్తాను"

"వెళ్లితే తీసుకురావడం నీతరంకాదు, కావస్తే పదిరూపాయలు పందెం" అన్నాను.

వాడు తెల్లబోయాడు.

"పోనీ, రమ్మని రాస్తాను" అన్నాడు.

"కాఫీకూడా నువ్వు పెట్టాల్సి వస్తుంది" అన్నాను.

శ్యామలతో నాకు నాలుగేళ్ల పరిచయం ఉండడాన్ని ఆమెగురించి నే నేమిటి చెప్పినా వాడికి వేదవాక్కు. అంచేత ఈ మాటలు వాడు నమ్మక తప్పలేదు.

"అయితే నువ్వనేదేమిటీ?" అన్నాడు.

"గట్టిగా నోరుమూసుక్కూర్చో. ఆవిడనే తనంత తాను రానీ"

"ఉత్తరమైనా రాయకపోతే అసలు వస్తుందా?"

"ఉత్తరమైనా రాయకపోతేనే వస్తుంది"

"నాకు అనుమానంగాఉంది....కాని, నువ్వు తక్కువవాడివికాదు కనక, కావలసినంత గట్టిగా నోరుమూసుకుంటాను" అన్నాడు వెంకట్రావు

వాడు చాలా గట్టిగా నోరుమూసుకున్నాడు. తరువాత వారంలో రెండు ఉత్తరాలు రాసింది శ్యామలవచ్చి తీసికెళ్లమని. వెంకట్రావుని బలవంతాన ఆపగలిగాను.

మరుసటి వారంలో పిక్చర్ రిలీజయేనాడు న్యూస్‌పేపర్ అడ్వర్టైజుమెంటల్లే వెంకట్రావు

నా రూమ్‌కి పరిగెట్టుకొచ్చి వెల్లడి చేశాడు: శ్యామల రాత్రి వస్తూందని.

"నామాట విని, రాత్రల్లా ఎక్కడైనా తిరిగి ఉదయం ఇంటికి వెళ్లు" అన్నాను.

వాడు తెల్లబోయి చూశాడు. "నేను వెంటనే పిచ్చాసుపత్రికి ఫోన్ చేస్తాను ఎవరైనా తప్పించుకు పోయారా? అని నీమాటలు అట్లా ఉన్నాయ్" అన్నాడు.

"అది కాదురా—నువ్వు ఏమాత్రం ఆత్రుత చూపినా, నీ నెత్తిమీదికి వస్తుంది. అథమం ఆలశ్యంగా వెళ్లు. మెయిల్ రాత్రి తొమ్మిదికి వస్తుందా? పదికి ఇంటికివెళ్ళు, ఇక్కడ ఫోంచెయ్యి" అని పదినిముషాల సేపు నా ఉద్దేశాన్నంతా వ్యక్తపరిచాను. వాడు మహాకష్టంతో సమ్మతించాడు.

తొమ్మిదీ ఇరవై అయాక వాడిని ఆపడానికి నాశక్తి చాలలేదు. ఏమైతే అవుతుందని వెళ్ళమన్నాను. వాడూ మెట్లు దిగాడు; నా టెలిఫోన్ పిల్చింది.

శ్యామల పిలుస్తూంది. వచ్చిందన్న మాట.

"నమస్కారం" అంది.

"నమస్కారాలు. క్షేమంగా వచ్చారా?" అన్నాను.

"ఏదో వచ్చాను లెండి. టెలిగ్రాం ఇచ్చినా రైలుదగ్గరకివచ్చే దిక్కు లేకపోయింది" అంది దీనంగా.

"వెంకట్రావు మాటా?"

"మరే... పాపం. మీరురాస్తే ఏదో గమ్మత్తుకి రాశారనుకున్నానుగాని, ఇంతగా ఈయన పాడయ్యారనుకున్నానా?...ఎన్ని ఉత్తరాలు రాసినా జవాబైనా ఇవ్వలేదు..."

"ధూర్తుడు..."

"నాకు మతి పోతోందంటే...ఏం చెయ్యడమో. మీరూ చూస్తూ ఊరుకుంటే ఎలాగునండీ?"

"నా చేతిలోపని నేను తప్పక చేస్తానుకదండీ..."

"ఎలాగైనా..." శ్యామల గొంతుక గాద్గదికం అయిపోయింది. డిస్కనక్ట్ చేసింది. నా తెలివితేటలకి నన్ను 'నేనే అభినందించుకుని పక్కమీద వాలాను.

ఉదయం కాఫీ తాగుతూంటే టెలిఫోను గంటు మ్రోగింది. శ్యామల. రాత్రి దైన్యం ఏమీ లేదు గొంతుకలో. మహోత్సాహంతో మాటలాడుతూంది.

"గుడ్ మార్నింగ్!"

"గుడ్ మార్నింగ్" అన్నాను.

"మీరు కథలు రాస్తారటగా?"

"కొంచెంగా"

"బాగా రాస్తారనుకుంటాను."

"ఫైలు పంపమంటారా?"

"థాంక్యూ...మీరు దీనజన సంరక్షణార్థం చూపే సంసిద్ధతకి ఎలాగ మిమ్మల్ని అభినందించాలో తెలియకుండా ఉంది."

"మీరనేది బోధపడడంలేదు."

నవ్వు... "మిత్రరత్నమా! మీరు కథలు రాయడం మానేసి నాటకాలాడించడం ప్రారంభించమని నా సలహా. తరువాత కలుద్దాం..."

కొంప మునిగింది... ఇంతకీ, ఈమెకంతా తెలిసిపోయిందా లేక గెస్ చేసిందా?

సాయంత్రం వెంకట్రావు కనిపించాడు... "నిజం ఒప్పుకోక తప్పలేదురా బ్రదర్" అన్నాడు ఆ అనుమానమూ తీరిపోయింది.

"తరువాత ఇంటికిరా. ఒక పాకశాస్త్రగ్రంథమూ, మరికొన్ని అవసర వస్తువులూ ఇస్తాను. త్వరలో అవసరం వస్తాయి" అన్నాను.

రానున్న రెండునెలల్లోను ఇండియాలో 15 అంతర్జాతీయ సమావేశాలు జరుగనున్నాయి. డిసెంబరు 14 నుంచి 19 వరకూ మదరాసులో జరుగనున్న ఆరవ అంతర్జాతీయ సాంఘిక సేవామహాసభలు ఇండియాలోజరిగిన అన్ని సమావేశాల కంటె గొప్పవి. సుమారు 1200 నుంచి 1500 మందివరకూ ప్రతినిధులు ఆ మహాసభకు రాగలరు.